


పేదరికాన్ని జయించి.. పీహెచ్‌డీ సాధించి!

చదువే ఆయుధంగా ఎదిగిన కొమ్ము శేఖర్ మాదిగ

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -93 గురువారం 10 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అసెంబ్లీ సంఘటనలపై
# సిట్ వేస్తాం

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..



**బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు**

**స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు**

**ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం**

**అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ**

**కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జర్నలిస్ట్ వార్త);**
అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ

మిగతా 2లో.

## 10వేల కోట్లతో
# రైల్వే కారిడార్లు



**దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్**

**ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్**

**నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

**దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు**

**7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం**

**తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం**

**4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు**

**పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం**

**రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 09, (జర్నలిస్ట్ వార్త);**
రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది.

మిగతా 2లో.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు
# షెడ్యూల్ విడుదల

**సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన**

**15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన**

**19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన**



**అమరావతి సెప్టెంబరు 09, (జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని

మిగతా 2లో.

# కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదు



**గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..**

**1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ**

**తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు**

**దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత**

**రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ**

**హైదరాబాద్ సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై

మిగతా 2లో.

## ఆ బూతులు భరించలేకనే
# కడుపు మండి మాట్లాడా!

**: కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**

**ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదన్న శంకర్**

**సీఎం, స్పీకర్ లను బీఆర్ఎస్ నేతలు దూషిస్తున్నారని మండిపాటు**

**కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని వ్యాఖ్య**



**హైదరాబాద్ సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు.

మిగతా 2లో.

## సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో
# నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ**

**తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు**

**ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటన**



2లో.

## శాసనసభ నుంచి బీఆర్ఎస్
# ఎమ్మెల్యేల సస్పెన్షన్







**కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు**

**సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు**

**సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం**

**సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా

మిగతా 2లో.

## తెలంగాణ పీఆర్‌సీపై
# ప్రభుత్వం కీలక అడుగు

**పీఆర్‌సీ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కీలక అడుగు**

**నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్‌సీ చైర్మన్‌కు సీఎస్ లేఖ**

**రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నిర్ణయం**

**బకాయి డీఏల విడుదలపై ఉద్యోగుల నుంచి డిమాండ్లు**

**ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల ఒత్తిడి**



2లో.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

## రూ.15 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి -బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బకాయిలు విడుదల కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు చదువును మధ్యలోనే ఆపే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**నల్లబ్యాడ్జీలతో బైక్ ర్యాలీ**

గత సోమవారం నిర్వహించిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో శాంతియుతంగా నిరసన తెలిపిన బీజేపీ నాయకులపై పోలీసులు దాడి చేశారని ఆరోపిస్తూ ధర్మసాగర్ మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ గాయపడటానికి నిరసనగా ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ, పోలీసుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగవెల్లి యుగేందర్, గంకిడి వెంకట్‌రెడ్డి, పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, దుస్సా రాములు, బచ్చు శివప్రసాద్‌రెడ్డి, రాజేందర్, గాజా శ్యాంసుందర్, చింతల రఘుదీర్, మాచర్ల అనిరుద్ధ్, కిష్టునాయక్, సాంబరాజు, కె. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను సామరస్యంగా జరుపుకోవాలి

### సీఐ కొండ్రు శ్రీను




**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సీఐ కొండ్రు శ్రీను సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ సమావేశమై పలు సూచనలు చేశారు. ఉత్సవాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా గొడవలు, వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు

# చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



**ఖమ్మం/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఖమ్మం జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ పిలుపు మేరకు 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు 53 దీపాలు వెలిగించారు. చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేసి రోడ్డు మార్గంలో కోర్టుకు తరలించారని, 53 రోజుల పాటు జైలులో నిర్బంధించారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయన అరెస్టును 'బ్లాక్ డే'గా పాటిస్తూ పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగించి నిరసన తెలిపినట్లు తెలిపారు.
కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కొండబాల కరుణాకర్, కేతినేని హరీష్, గుత్తా సీతయ్య, రాజరాజేశ్వరి, మేకల సత్యవతి, మందపల్లి రజిని, లావణ్య, పెనుగొండ ఉపేందర్, పాలడుగు కృష్ణప్రసాద్, కొలికొండ మురళి, నాగండ్ల లక్ష్మణ్, ప్యారిస్ వెంకన్న, గుండెపిన్ని నాగేశ్వరరావు, తాళ్లూరు నరేష్, వేపూరి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# పట్టుపరిశ్రమతో రైతులకు అధిక లాభాలు

## శాస్త్రీయ పద్ధతులతో సాగు చేస్తే ఆదాయం మరింత పెంపు -ముస్త్యాలపల్లిలో రైతుశాస్త్రవేత్తల ముఖాముఖి చర్చ




**దామెర/హనుమకొండ బ్యురో సెప్టెంబర్ 9 (జర్నలిస్టు వార్త):** పట్టుపరిశ్రమను శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని పట్టు పరిశ్రమ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాలపల్లిలో 'మేరా రేశంమేరా అభిమాన్' (ఎంఆర్‌ఎంఏ) 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం శాస్త్రీయ, లాభదాయక పట్టుపరిశ్రమపై రైతుశాస్త్రవేత్తల పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు.
కేంద్ర పట్టు బోర్డు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా పట్టుపరిశ్రమపై రైతుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, కొత్తగా ఈ రంగంలోకి వచ్చే రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పట్టుపరిశ్రమను కేవలం అనుబంధ వృత్తిగా కాకుండా స్థిరమైన ఆదాయ వనరుగా అభివృద్ధి చేసుకునే అవకాశాలపై శాస్త్రవేత్తలు వివరించారు.

**మల్బరీ సాగులో శాస్త్రీయ పద్ధతులు కీలకం**

మల్బరీ తోటల స్థాపన నుంచి పట్టు పురుగుల పెంపకం వరకు ప్రతి దశలో శాస్త్రీయ విధానాలను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. నేల స్వభావాన్ని పరిశీలించడం, అనువైన రకాలను ఎంపిక చేసుకోవడం, సరైన సమయంలో ఎరువులు వేయడం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, మొక్కల సంరక్షణ వంటి అంశాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
పట్టు పురుగుల పెంపకంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెంపక గృహాల్లో ఉష్ణోగ్రత, తేమను అనుకూలంగా ఉంచడంతో పాటు వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పట్టు పురుగుల ఆరోగ్యంపై ప్రభావం చూపి రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**

పట్టుపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పట్టు పురుగుల పెంపక గృహాల నిర్మాణం, మల్బరీ తోటల ఏర్పాటు తదితర అంశాల్లో లభించే ప్రభుత్వ సహాయానికి సంబంధించిన అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, చేయాల్సినవిచేయకూడనివి వంటి అంశాలను రైతులకు వివరించారు.
రాయితీల కోసం దరఖాస్తు చేసుకునే ముందు నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని, అధికారుల సూచనల మేరకు పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే పట్టుపరిశ్రమలో పెట్టుబడి భారాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చని వివరించారు.

**రైతుల సందేహాలకు శాస్త్రవేత్తల సమాధానాలు**

కార్యక్రమంలో రైతులతో నేరుగా ముఖాముఖి చర్చ నిర్వహించి వారి సమస్యలు, అనుభవాలు, సందేహాలను తెలుసుకున్నారు. మల్బరీ సాగులో ఎదురయ్యే సమస్యలు, పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల నివారణ, నాణ్యమైన పట్టు ఉత్పత్తి, ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడగగా శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా సమాధానాలు ఇచ్చారు.
ఈ కార్యక్రమానికి సుమారు 45 మంది రైతులు హాజరయ్యారు. ప్రగతిశీల రైతులతో పాటు పట్టుపరిశ్రమను కొత్తగా చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత, మహిళలు పట్టుపరిశ్రమ వైపు అడుగులు వేస్తే స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

**పట్టుపరిశ్రమకు శిక్షణతో మరింత ప్రయోజనం**

పట్టుపరిశ్రమలోకి ప్రవేశించే రైతులు ముందుగా శిక్షణ పొందడం ద్వారా అనుభవ రాహిత్యంతో వచ్చే నష్టాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తల సలహాలు, అధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సాగు చేస్తే నాణ్యమైన పట్టు ఉత్పత్తితో మంచి మార్కెట్ ధర పొందే అవకాశం ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమాన్ని సీఎస్‌బీసీఎస్‌ఆర్‌టీఐ, మైసూరు శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, ఎంఆర్‌ఎంఏ జిల్లా నోడల్ అధికారులు సంజీవ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వరంగల్‌హనుమకొండ పట్టు పరిశ్రమ అధికారి మల్లయ్య సమన్వయంతో నిర్వహించారు. ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ కార్యక్రమానికి హాజరై రైతులను ప్రోత్సహించారు.
పట్టుపరిశ్రమలో శాస్త్రీయ పద్ధతులను విస్తృతంగా అమలు చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడ్డారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

### ఖమ్మం కలెక్టరేట్ వద్ద నేడు బీజేపీ మహాధర్నా




**సత్తుపల్లి/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం 9.30 గంటలకు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు.సత్తుపల్లి నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు భానోత్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని ఆరోపించారు. మహాధర్నాలో బీజేపీ శ్రేణులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావును అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అరెస్టులతో బీజేపీ ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, ఉపాధ్యక్షుడు భాస్కరణి వీరంరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చీకటి వసంతరావు, పట్టణ కార్యదర్శి సాయిచందర్, సీనియర్ నాయకులు ఆచంట సుబ్రహ్మణ్యం, నూతులకంటి పెద్దిరాజు, బట్టి శివసాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత గ్రామ ప్రణాళికతో అభివృద్ధి

## ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి -భూగర్భ జలాల పెంపునకు జలసిరి పనులు చేపట్టాలి






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 9 (జర్నలిస్టు వార్త):** గ్రామాల సమగ్ర అభివృద్ధికి వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక ఎంతో కీలకమని డీఆర్డీఓ అదనపు అధికారి ప్రసన్నలక్ష్మి అన్నారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. ధర్మసాగర్ మండల సమన్వాయ సమావేశం బుధవారం ఎంపీడీఓ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసన్నలక్ష్మి సర్పంచులు, అధికారులకు పలు సూచనలు చేశారు.
గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను ముందుగా గుర్తించి, ఇంకా అవసరమైన సదుపాయాలను ప్రజలతో చర్చించి ప్రణాళికలో చేర్చాలన్నారు. అత్యవసరమైన పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామానికి అవసరమైన 20 నుంచి 30 పనులను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో చేపట్టేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు నిరంతరం పనులు కల్పించడంతో పాటు మెటీరియల్ పనులను కూడా ముందుగానే గుర్తించాలని తెలిపారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రసన్నలక్ష్మి సూచించారు. ప్రతి ఇంటికి సోక్‌పిట్, అవసరమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులను ప్రణాళికలో చేర్చాలని సూచించారు.

**2026 లక్ష్యంగా దీర్ఘకాలిక ప్రణాళిక**

వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికను కేవలం ఒక సంవత్సరానికే పరిమితం చేయకుండా 2026నాటికి వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికగా రూపొందించుకోవాలని అన్నారు. తొలి గ్రామసభలో గుర్తించిన పనులను పరిశీలించి, తుది గ్రామసభలో ప్రజల ఆమోదం పొందిన అనంతరం అమలు చేయాలని సూచించారు.

**జలసిరి కి ప్రాధాన్యం**

భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని గ్రామాల్లో సమర్థంగా అమలు చేయాలని ప్రసన్నలక్ష్మి సూచించారు. సోక్‌పిట్లు, రీచార్జ్ పిట్లు ఫార్మ్ పాండ్లు తదితర నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలమట్టం పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో జిల్లా అధికారులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి

### కేసముద్రంలో మిల్లర్ల నిరసన



**కేసముద్రం/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేసముద్రంలో మిల్లర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన తెలిపిన అనంతరం ర్యాలీగా వెళ్లి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక మిల్లర్లు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంపై సర్పంచ్ కొరడా!

## పాఠశాలలో ఆకస్మిక తనిఖీ.. నాణ్యతపై ఆరా సర్పంచ్ బిల్లా యాదగిరి



**వేలేరు/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వొద్దని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి హెచ్చరించారు. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ బిల్లా యాదగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించిన సర్పంచ్.. భోజనం నాణ్యతపై విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగానే ఉందని విద్యార్థులు సమాధానం ఇవ్వడంతో సర్పంచ్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కమిటీ సభ్యులకు స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కలిపి 328 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడి ఉన్న మధ్యాహ్న భోజనం విషయంలో అధికారులు, పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.విద్యార్థులకు పెట్టే భోజనం విషయంలో రాజీ ప్రసక్తే లేదు అన్నట్టుగా సర్పంచ్ బిల్లా యాదగిరి స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం చేయడం



ప్రత్యేకంగా నిలిచింది. వంట నిర్వాహకులను అభినందించారు.

ఈ తనిఖీలో ఉపసర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయులు సత్యం, మధ్యాహ్న భోజన కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఐని కలిసిన రాష్ట్ర నాయకులు



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీఐ కోంద్ర శ్రీనును అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్‌తో పాటు రాష్ట్ర, మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఐతో పలు విషయాలపై మాట్లాడారు.సీఐ కోంద్ర శ్రీను మంచి విద్యావేత్త, నైపుణ్యం కలిగిన అధికారిగా వారు పేర్కొన్నారు. ఎల్కతుర్తి మండలానికి ఆయన రావడం ప్రజల అదృష్టమన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడుతున్నారని, వారి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మద్యానికి దూరంగా ఉంటూ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కోరారు.కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి సాతూరి రాజమౌళి, ధర్మారం గ్రామ ఉపసర్పంచ్ కొత్తపల్లి కళ్యాణి-వంశీ, కాదాసు రాజేష్, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**తల్లాడ/సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతి పొందాలని తల్లాడ ఎస్సై వెంకటేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు.మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ కేటాయించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అనుమతి పొందాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు నాణ్యమైన వైరింగ్ ఉపయోగించడంతో పాటు విద్యుత్ శాఖ అనుమతి



తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి 24 గంటల పాటు పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు.

**డీజేలకు అనుమతి లేదు**

శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని ఎస్సై స్పష్టం చేశారు. నిర్ణీత పరిమితిలో సౌండ్ బాక్సులను మాత్రమే వినియోగించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు మండపాల వద్ద నీరు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ప్రధాన రహదారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎస్సై వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేష్‌కుమార్, పిచ్చయ్య, లక్ష్మణ్, వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# సర్పంచుల అరెస్ట్ అన్యాయం

## కేసముద్రం పీఎస్‌కు వాంకుడోత్ రవినాయక్ తరలింపు

**కేసముద్రం/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఎస్ఎఫ్‌సీ నిధులను ప్రతి నెలా క్రమం తప్పకుండా గ్రామపంచాయతీలకు కేటాయించాలని, ఉపసర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వాంకుడోత్ రవినాయక్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్పంచుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో సర్పంచుల పోరాటాన్ని అణచివేయలేరని స్పష్టం చేశారు.

# పేదల బియ్యానికి అక్రమ వ్యాపారం!

## దేవన్నపేట రైస్‌మిల్లులో 56 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత -ఇద్దరి అరెస్టు.. రూ.2.07 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**హసన్‌పర్తి/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** పేదలకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి.. రీప్యాకింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠా గుట్టును హసన్‌పర్తి పోలీసులు రట్టు చేశారు. దేవన్నపేటలోని శ్రీలక్ష్మీ ప్రసన్న రైస్‌మిల్లుపై మంగళవారం రాత్రి దాడి చేసి సుమారు 56 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం.హసన్‌పర్తి ఎస్ఐ ఎస్.రవి సిబ్బందితో కలిసి దేవన్నపేటలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందింది. దీంతో మిల్లుపై దాడి చేయగా.అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా అక్రమ బియ్యం దందా వెలుగులోకి వచ్చింది.అరెస్టయిన వారిలో బొర్నపల్లికి చెందిన కేశబోయిన మొగిలి (50), కమలాపూర్‌కు చెందిన బెజ్జంకి శ్రీనివాస్ (57) ఉన్నారు.



**రీప్యాకింగ్.అధిక ధరకు విక్రయం**

హసన్‌పర్తి, పరిసర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి రైస్‌మిల్లుకు తరలించేవారని పోలీసులు తెలిపారు. అక్కడ బియ్యాన్ని తూకం వేసి వాణిజ్య సంచుల్లో, జై శ్రీరామ్ బ్రాండ్ సంచుల్లో రీప్యాకింగ్ చేసి దుకాణాల ద్వారా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 50 కిలోల బరువున్న 64 బస్తాలు, సుమారు 25 కిలోల బరువున్న 106 బస్తాలు ఉన్నాయి. బియ్యం విలువ సుమారు రూ.1.96 లక్షలు కాగా.. తూకం మిషన్, సంచులు కుట్టే మిషన్‌తో కలిపి మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.2.07 లక్షలుగా పోలీసులు తెలిపారు.ఈ వ్యవహారంలో ఏటీఎం రాజు, వెంకట్, రైస్‌మిల్ యజమాని చిదురాల శ్రీనివాస్ తదితరుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చేపట్టారు. పేదల బియ్యాన్ని అక్రమంగా మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ.మహేందర్ హెచ్చరించారు.

# రైతులంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

**కేసముద్రం/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందించే సంక్షేమ పథకాలు, రాయితీలు, సేవల ప్రయోజనాలు పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న సూచించారు. కేసముద్రం మండలంలోని రైతువేదికలో బుధవారం రైతు నమోదుల ప్రక్రియ చేపట్టారు.ఈ సందర్భంగా ఏవో వెంకన్న మాట్లాడుతూ..



రైతు నమోదు చేసుకోని వారికి భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. మండలంలోని రైతులందరూ ఆలస్యం చేయకుండా తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్, భూమికి సంబంధించిన ఇతర పత్రాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎస్.రాజీవ్ లోచన్, వి.లావణ్య, కె.శ్రీకాంత్, ఎన్.సాయిచరణ్, ఎం.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి.. పీహెచ్‌డీ సాధించి!

## చదువే ఆయుధంగా ఎదిగిన కొమ్ము శేఖర్ మాదిగ





**హైదరాబాద్/ ఉస్మానియా క్యాంపస్ ,సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త);** ఒకవైపు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన తల్లిదండ్రులు. మరోవైపు పరిమిత వనరుల మధ్య చదువుకోవాలన్న తపన.చిన్ననాటి నుంచే ఎదురైన కష్టాలను అధిగమిస్తూ ఉన్నత విద్యలో అడుగులు.విద్యార్థి దశలో సామాజిక ఉద్యమాల వైపు అడుగులు. చివరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా. ఇది కొమ్ము శేఖర్ మాదిగ విద్యా ప్రస్థానం.

సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము సరోజఅంజయ్య దంపతుల కుమారుడు శేఖర్. కూలీ పనులే జీవనాధారంగా ఉన్న కుటుంబంలో పుట్టిన ఆయనకు ఉన్నత చదువులు అంత సులభంగా సాగలేదు. అయినా చదువుపై ఆసక్తిని వదులుకోలేదు. స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివి. అనంతరం ఎల్‌బీనగర్‌లో పదో తరగతి, ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. నిజాం కళాశాలలో పట్టభద్ర విద్యను అభ్యసించారు.

**చదువుతోపాటు సామాజిక స్పృహ**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన సమయంలో విద్యార్థిగా ఉన్న శేఖర్. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం సాగిన ఉద్యమాలతో ఆయనకు మరింత అనుబంధం ఏర్పడింది. మాదిగ విద్యార్థి సమాఖ్యలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థి సమస్యలు, సామాజిక అంశాలపై తనదైన గొంతు వినిపించారు.

**ఉద్యమం ఆగలేదు.. చదువు ఆగలేదు**

సామాజిక ఉద్యమంలో కొనసాగుతూనే ఉన్నత విద్యపై దృష్టి సారించడం శేఖర్ ప్రయాణంలో మరో విశేషం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రజాపాలనలో స్నాతకోత్తర విద్యను పూర్తిచేసి, అదే విభాగంలో పరిశోధనకు ప్రవేశించారు. ప్రొఫెసర్ వై.పార్థసారథి పర్యవేక్షణలో పట్టణ సుపరిపాలన దిశగా పురపాలక సంస్థల సభ్యులు, వార్డు సభ్యుల సామర్థ్య పెంపుపై తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రంగా చేసుకుని పరిశోధన చేశారు.

ఈ పరిశోధనకు గుర్తింపుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. ఈ నెల 8న ఓయూ ఠాగూర్ సభామందిరంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి శివప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా, ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా శేఖర్ పట్టా అందుకున్నారు.

**ఒక కుటుంబానికే కాదు.. ఎందరికో స్ఫూర్తి**

కూలీ కుటుంబం నుంచి వచ్చిన ఓ విద్యార్థి. ఎదురైన ఆర్థిక పరిమితులను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం వెనుక పట్టుదలతో పాటు కుటుంబం అందించిన ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఉన్నాయి. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుచేసుకుంటూ విద్యను తన జీవితానికి మార్గంగా మలచుకున్న శేఖర్ ప్రస్థానం గ్రామీణ, పేద కుటుంబాల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

డాక్టరేట్ సాధించిన సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగతో పాటు పరిశోధనలో





సహకరించిన ప్రొఫెసర్ వై.పార్థసారథి, అధ్యాపకులు, సిబ్బందికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న ఆయనను వివిధ విద్యార్థి, సామాజిక సంఘాల నాయకులు అభినందించారు.

# కాళోజికి ఘన నివాళి



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త);** కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలు, సామాజిక అసమానతలను తన రచనల ద్వారా నిర్భయంగా ప్రశ్నించిన కాళోజి సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
గురువారం 10 సెప్టెంబర్ 2026

# మున్సిపాలిటీ నిర్లక్ష్యం.. సామాన్యుడి అవస్థ



**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండలంలోని ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో మున్సిపాలిటీ పారిశుద్ధ్య నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఒకటో డివిజన్‌లో సైడ్ కాలువల పరిస్థితి అధ్వానంగా మారడంతో ఓ రిటైర్డ్ ఉద్యోగి స్వయంగా కాలువను శుభ్రం చేసుకుంటున్న దృశ్యం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. మున్సిపాలిటీ సిబ్బంది వారానికి ఒకసారి మాత్రమే సైడ్ కాలువలను శుభ్రం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రతిరోజూ మురుగు పేరుకుపోవడంతో దుకాణం నిర్వహించుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేకపోవడంతో తానే కాలువను శుభ్రం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సైడ్ కాలువలను తరచూ శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యార్థులకు కిట్లు.. రోగులకు పండ్ల పంపిణీ



**కేసముద్రం/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు జన్మదిన వేడుకలను కేసముద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేసముద్రం మున్సిపాలిటీలోని చైతన్యనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో బీఆర్ఎస్ యువ నాయకుడు వల్లందాస్ యశ్వంత్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర విద్యా సామగ్రితో కూడిన కిట్లను, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు వల్లందాస్ శ్రీకాంత్, శ్రీనాథ్, పందుల సతీష్, మామిడి అజయ్, స్టాలిన్, వినీత్, బాబురావు, పట్ల చందు, బన్నీ, సన్నీతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాళోజీ ఆశయాలను అనుసరించాలి

**ప్రజాకవి 112వ జయంతి వేడుకల్లో కలెక్టర్ స్నేహ శబరిష్**



**మహబూబాబాద్/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలు, మానవతా విలువలు, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బుధవారం కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవన విధానాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని అన్నారు. తెలుగు సహా పలు భాషల్లో రచనలు చేసిన బహుభాషా కోవిదుడిగా ఆయనకు గుర్తింపు ఉందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కాళోజీ చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన ఆయనకు 1992లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించిందని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధిగా కూడా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. మరణానంతరం అవయవాలను దానం చేసి మానవతా విలువలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఐడీఓసీ సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాతా మధు అరెస్టు ఓ డ్రామా

**డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్**



**ఎల్కతుర్తి/ సెప్టెంబరు 9:( జర్నలిస్ట్ వార్త)**స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు ఓ డ్రామాలా ఉన్నాయని డీహెచ్‌పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ విమర్శించారు. తాతా మధును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి పిలుపునిచ్చిన దళిత సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదన్నారు. దళితుల సమస్యలపై మాల, మాదిగలతో పాటు 57 ఉపకులాల సంఘాల నాయకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితులపై దాడులు, అవమానాలను ఎప్పటికప్పుడు ఖండించకపోతే ప్రజల్లో సంఘాలపై నమ్మకం సన్నగిల్లుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టకుండా ఆయన పేరును రాజకీయాలకు వినియోగించుకోవడం సరికాదన్నారు. కత్తి పద్మారావు, శివసాగర్, నేతల ప్రతాప్, కాళోజీ నారాయణరావు, గద్దర్ వంటి వారు సామాజిక చైతన్యానికి కృషి చేశారని గుర్తుచేశారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిపై 24 గంటల్లో కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, ఆరెపల్లి చంద్రమౌళి, ఎర్ర సత్యం తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి



**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**గ్రామ పంచాయతీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ జిల్లాకు చెందిన సర్పంచులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల సర్పంచులు కలెక్టరేట్‌కు చేరుకుని తమ డిమాండ్లను వివరించారు. ఉపసర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని, స్టాంప్ డ్యూటీ, సీనరేజ్ ఛార్జీల ద్వారా పంచాయతీలకు రావాల్సిన ఆదాయాన్ని నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. హౌస్ నంబర్లు, గృహ నిర్మాణ అనుమతులను గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీల పరిధిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల రాకేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు దుగ్గాల రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షురాలు మరిజే అనిత, ప్రధాన కార్యదర్శి నకీర్త రాజు, కార్యనిర్వహణ అధ్యక్షుడు పెద్దబోయిన రవీందర్ యాదవ్, కార్యదర్శులు పోలేపాక శ్రీనివాస్, బొంతా రమేష్, ఇతర నాయకులు, జిల్లాలోని వివిధ మండలాల సర్పంచులు పాల్గొన్నారు.

# వంగపహాడ్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం: పుట్ట తిరుపతి**



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
వంగపహాడ్ 2వ డివిజన్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్ట తిరుపతి మాట్లాడుతూ పేద, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్‌తో పాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, సులభంగా అందుతాయని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, ఉపాధ్యక్షుడు నలుబోలా రవీందర్, ప్రధాన కార్యదర్శి తేట్టే గణేష్, దోమ కుమార్, మాదుగూరి కుమారస్వామి, మాచర్ల నందం, మంద కొమురయ్య, జి.పి.ఓ. మహేందర్, రేషన్ డీలర్లు కమల, క్రాంతి, రాణదేవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# కాళోజీ ఆశయాలను విద్యార్థులు కొనసాగించాలి




**కేసముద్రం/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ప్రజల భావాలు, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడు కాళోజీ అని పేర్కొన్నారు. ఆయన రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయని, విద్యార్థులు కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మాతృభాషను ప్రేమించి, గౌరవించాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయుడు వీరబోయిన సుమన్ మాట్లాడుతూ తెలంగాణ భాష విశిష్టత, మాధుర్యం, సాంస్కృతిక వైభవాన్ని విద్యార్థులకు వివరించారు. మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ భాష ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే గొప్ప భాష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కాళోజీకి ఘనంగా నివాళులర్పించారు.

## నూతనంగా సి.ఎస్. నంబర్1
# డీజే సౌండ్ సిస్టం ప్రారంభం



**తల్లాడ/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**
కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల ప్రజలకు అందుబాటులోకి నూతన డీజే సౌండ్ సిస్టం వచ్చింది. కల్లూరు మండలం ఓబుల్‌రావు బంజర గ్రామానికి చెందిన బి.చందు, బి.సాయి సంయుక్తంగా సి.ఎస్. నంబర్1 డీజే సౌండ్ సిస్టంను ఏర్పాటు చేశారు. తల్లాడ మండలం అంజనాపురంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డీజేను ప్రారంభించారు. ఈ సౌండ్ సిస్టంలో 8 బాక్సులు, 4 బేసులు, 2 కాంపిటేషన్ టాప్‌లు ఉండడంతో స్పష్టమైన శబ్దం వచ్చేలా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాలతోపాటు జిల్లా ప్రజలకు కూడా సేవలు అందిస్తామని, ఈ కార్యక్రమం స్వభావాన్ని బట్టి సౌకర్యవంతమైన ధరలకు డీజే సౌండ్ సిస్టం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిల్, మధు, ఆపరేటర్ ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్ల ఆందోళన

**అధికారులకు వినతిపత్రం..**

**సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉద్ధృతం**



**కేసముద్రం/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేసముద్రంలో మిల్లర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నిరసన తెలిపిన అనంతరం ర్యాలీగా వెళ్లి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక మిల్లర్లు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన అధికారి



**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలో కొనసాగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని అధికారి కందగట్ల రమాకాంత్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ప్రక్రియను తనిఖీ చేయడంలో భాగంగా హసన్‌పర్తి 9వ వార్డులోని బీఎల్ఓ కేంద్రాన్ని సందర్శించారు. అప్పటికే పది మందికిపైగా ఓటర్లు నమోదు కోసం దరఖాస్తులు సమర్పించేందుకు కేంద్రానికి వచ్చినట్లు గుర్తించారు. నమోదు చేసుకోని ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్న అధికారి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెలాఖరులోపు ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## భారతమ్మకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నివాళి



**కేసముద్రం/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు లక్ష్మీనగర్ కాలనీకి చెందిన కొండపల్లి వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల తల్లి దివంగత కొండపల్లి భారతమ్మ దశదిన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు హాజరై భారతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రఫీ, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్ యాదవ్, కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ సేవలు చిరస్మరణీయం



**సత్తుపల్లి/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త):**
పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.వెంకటాచారి అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బుధవారం జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి జీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాష, సంస్కృతి, ఆత్మగౌరవ పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలను అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, కార్మిక సంఘాల ప్రతినిధులు స్మరించుకున్నారు. కాళోజీ తన అక్షరాలను ఆయుధాలుగా మలిచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఎస్ ఐ ఆర్ ఫార్మ్ నోటీసులు అందుకున్న ఓటర్ల పట్ల నిర్లక్ష్యం

## మున్సిపాలిటీ సిబ్బందిపై ప్రజల ఆగ్రహం




**కల్లూరు/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు ఓటర్ల జాబితా ప్రత్యేక ఎస్ ఐ ఆర్ ఫార్మ్ నోటీసులు అందుకున్న ఓటర్ల పట్ల నిర్లక్ష్యంకల్లూరు మున్సిపాలిటీ సిబ్బందిపై ప్రజల ఆగ్రహం:ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్-2026) ప్రక్రియలో భాగంగా ఎస్ ఐ ఆర్ ఫార్మ్ నోటీసులు అందుకున్న ఓటర్ల పట్ల కల్లూరు మున్సిపాలిటీ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్న ఓటర్లను అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సమస్య తీవ్రత మరియు ఓటర్ల ఆవేదన: గంటల తరబడి నిరీక్షణ: నోటీసులు అందుకున్న బాధితులు తమ వివరాలను సరిచేసుకునేందుకు, మున్సిపల్ కార్యాలయంలో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

కౌంటర్ల కొరత సవరణల పరిశీలన కోసం లితగినన్ని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది గైర్హాజరు, నిర్లక్ష్య సమాధానాలు కార్యాలయంలో సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం, ఒకవేళ ఉన్నా బాధ్యతారహితంగా సమాధానాలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారని ఓటర్లు ఆరోపిస్తున్నారు. వృద్ధులు, మహిళల ఇక్కట్లు: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల నుండి వస్తున్న వృద్ధులు, మహిళలు కనీస సౌకర్యాలు లేక ఎండలో అల్లాడిపోతున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాలు బేఖాతరు:అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కల్లూరు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలను క్షుణ్ణంగా అమలు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్ల అర్హతలను పరిశీలిస్తున్న తరుణంలో, స్థానిక సిబ్బంది ఇలాంటి ఉదాసీన వైఖరి ప్రదర్శించడం పట్ల,తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రజల డిమాండ్:తమ ఓట్లు ఎక్కడ తొలగిపోతాయోనని ఆందోళన చెందుతున్న ఓటర్లకు భరోసా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంటర్ విద్యార్థి బలవన్మరణం




**సత్తుపల్లి/సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త);**సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తమ్మిరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి (19) ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు.ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీచరణ్‌రెడ్డి మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడికి సన్మానం.



**బయ్యారం/,సెప్టెంబర్ 9.(జర్నలిస్ట్ వార్త)**ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బయ్యారం జడ్పిహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కాళోజీ సాహిత్య ప్రస్థానం,ప్రజా జీవితంపై ఆయన కలం చూపిన ప్రభావాన్ని ఉపాధ్యాయులు,విద్యార్థులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ధనంజయ మాట్లాడుతూ అక్షర రూపం దాల్చిన ఒక సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక అనే అక్షర శక్తిని తన సాహిత్యంతో నిరూపించిన కాళోజీ, పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది అంటూ వ్యక్తి జీవితాన్ని సమాజానికి అంకితం చేయాలనే సందేశాన్ని అందించారని గుర్తు చేశారు.తెలుగు భాషా ఉపాధ్యాయుడు కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ ఒక ప్రజాస్వామిక గొంతుక, ధర్మాగ్రహపు ధిక్కారం,హక్కుల ధ్వని,స్వేచ్ఛా నినాదమని పేర్కొన్నారు.అనంతరం ఉపాధ్యాయ బృందం తెలుగు భాషా ఉపాధ్యాయుడు కొలిపాక శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించించారు.విద్యార్థులు కవితలు,పద్యాలు,ఉపన్యాసాలతో ఆకట్టుకున్నారు.తెలంగాణ భాషా మాధుర్యాన్ని,కాళోజీ సాహిత్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి .ఉపాధ్యాయులు రామేశ్వర్‌రావు, దస్తగిరి, రవీందర్,సుధాకర్, లక్ష్మయ్య, అరుణశోభ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు,హాథిరామ్,సునీత,కళావతి,సర్వేష్,నజీమా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళాలో 25 ఉద్యోగాలు



**మహబూబాబాద్/ సెప్టెంబరు 9 (జర్నలిస్ట్ వార్త);** జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో డెలివరీ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 11న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత తెలిపారు. మొత్తం 25 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.18 నుంచి 35 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు, ఎస్ఎస్-సీ ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. బైక్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్హతల ధ్రువపత్రాలు, రెజ్యూమేతో మహబూబాబాద్ నూతన కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం రెండో అంతస్తులోని గది నంబర్ 25లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు.

# జిల్లా కలెక్టర్ కి కొత్తపేట పంచాయతీ తాగునీటి కష్టాలను తీర్చాలని వినతి.

**-సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్.**



**బయ్యారం/,సెప్టెంబర్ 9.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో భూ రీ-సర్వే తనిఖీకి వచ్చిన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ని కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ కలిసి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తో మాట్లాడుతూ గ్రామంలో గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,తాగునీటి కోసం గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని,సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే గ్రామంలో కొత్తగా తవ్వించిన బోరు బావికి మోటార్,పైప్‌లైన్ మంజూరు చేసి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన నిధులు,అనుమతులు మంజూరు చేయాలని సర్పంచ్ వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల సురేష్,ధనసరి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం.

**-తహసీల్దార్ నాగరాజు**



**బయ్యారం/,సెప్టెంబర్ 9.(జర్నలిస్ట్ వార్త)** ప్రజాకవి,స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని మండల తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల జీవన భాషకు కాళోజీ ప్రాధాన్యత కల్పించారని అన్నారు.తెలంగాణ యాస,భాషకు తన రచనల ద్వారా గౌరవం తీసుకొచ్చిన కాళోజీ..నిజాం నిరంకుశత్వం,రాచరికపు అణచివేత, ప్రజా పోరాటాలపై తన కలంతో నిరంతరం పోరాడారని పేర్కొన్నారు.పేదలు,సామాన్యుల పక్షాన నిలిచిన కాళోజీ..అన్యాయాన్ని ఎదిరించే తత్వాన్ని,ప్రశ్నించే స్వభావాన్ని ప్రజల్లో పెంపొందించారని తెలిపారు.తెలంగాణ ప్రజల ఉద్యమ ధ్వనిగా నిలిచిన ఆయన అన్ని సందర్భాల్లో తెలంగాణ వాదానికి కట్టుబడి ఉన్నారని తహసీల్దార్ నాగరాజు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలుజసందీప్,ఉపేందర్,వెంకన్న రెవిన్యూ సిబ్బంది చిరంజీవి,ముత్తయ్య,స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా 33 కేవీ విద్యుత్ లైన్

**షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం..**

**ఇళ్లలో విద్యుత్ పరికరాలు మాయం**

**ప్రాణనష్టం జరగకముందే చర్యలు తీసుకోవాలని**

**ఎర్నాం కాలనీవాసుల వేడుకోలు**

**దామరచర్ల/ సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** దామరచర్ల ఎర్నాం కాలనీలో 33 కేవీ విద్యుత్ లైన్ తరచూ షార్ట్‌సర్క్యూట్‌కు గురవుతూ ప్రజలకు ప్రమాదకరంగా మారింది. లైన్ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం మధ్యాహ్నం రైతు గుంజ శంకర్ పశువుల కోసం గడ్డిని తీసుకెళ్తుండగా 33 కేవీ లైన్‌లో అకస్మాత్తుగా షార్ట్‌సర్క్యూట్ జరగడంతో గడ్డివాము అంటుకుని దగ్ధమైంది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఇదే సమయంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలనీలోని కొన్ని ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు తదితర విద్యుత్ పరికరాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

గతంలోనూ పలుమార్లు ఇదే విధంగా విద్యుత్ సమస్యలు తలెత్తాయని వారు పేర్కొన్నారు.

ఎర్నాం కాలనీ ప్రధాన బజారులోనే ఈ భారీ విద్యుత్ లైన్ ఉండటంతో నిత్యం పాఠశాల వ్యాన్లు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరిగిన ప్రతిసారీ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి 33 కేవీ లైన్‌ను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.





# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి.

**-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**



**బయ్యారం/,సెప్టెంబర్ 9.(జర్నలిస్ట్ వార్త)** భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామ పరిధిలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం,హద్దుల గుర్తింపు,డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను,ఫీల్డ్ రిజిస్టర్ లను ఆమె నిశితంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు,గంధపల్లి సర్పంచ్ ప్రవీణ్ నాయక్,సర్వేయర్లు,గ్రామ పంచాయతీ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ వైతాళికుడు కాళోజీ.

**-సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్.**



**బయ్యారం/,సెప్టెంబర్ 9.(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణ తొలిపొద్దు కాళోజీ నారాయణరావు అని సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ అన్నారు.తెలంగాణ ప్రజల గొడవనే తన గొడవగా భావించి జీవితాంతం ప్రజల కోసం పోరాడిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు.బుధవారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని సింగారం పంచాయతీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ప్రజాకవిగా, ఉద్యమకారుడిగా కాళోజీ నారాయణరావు భారత స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారని సర్పంచ్ తెలిపారు.నిరంకుశత్వం, అరాచక పాలనకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి ప్రజల్లో చైతన్యం రగిల్చారని అన్నారు.పలు భాషల్లో రచనలు చేస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చుంచు మమత,వార్డ్ నెంబర్ చెరుకుపల్లి మనీషా,పంచాయతీ కార్యదర్శి బాధవత్ సరిత,మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి సీతారాములు,నాయకులు చుంచు సాయికిరణ్,యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల మహాధర్నాకు తరలిరావాలి

**హనుమకొండ/సెప్టెంబర్ 9(జర్నలిస్ట్ వార్త):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం నిర్వహించే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య పిలుపునిచ్చారు. 2024 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 45 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని అమలు చేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడో పీఆర్సీని నియమించాలని, పాత డీఏ బకాయిలు, జీపీఎఫ్ రుణాలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు విడుదల చేయాలన్నారు. ఈ-కుబేర్‌ను రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, ఎన్ఈహెచ్ఎస్ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని తెలిపారు.

# భూక్య బాషాకు కాంగ్రెస్ నేతల నివాళి



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 9(జర్నలిస్ట్ వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని భవానికుంట తండాకు చెందిన మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీలత తండ్రి, జడ్పీటీసీ అభ్యర్థి భూక్య బాషా (బుధవారం) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి.అన్వర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మరుపట్ల సాయికుమార్ పాల్గొన్నారు.